కుంటున్నావేమో! నువ్వింకా కుర్రాడివి కాబట్టి ప్రపంచం సంగతి నీకింకా పూర్తిగా తెలీదు. "సంఘం" నాలాంటి వ్యక్తుల్ని ఎన్నటికీ క్షమించదు. వాళ్ళదృష్టిలో నేను దోషిని. వేశ్య అనేది, కొంతమంది విలాసులకు సుఖసాధనం. అలాంటిదాన్ని వాళ్ళకు కాకుండా చేసినందుకు వాళ్లు నన్ను ఎప్పటికీ క్షమించరు. నేను వెడుతు వెడుతూ ఆఖరుసారి అప్పుతీసుకుంటున్నా. ఈ పేదకుర్రాళ్లు తాము అనాథలుగా భావించకుండా చెయ్యాలి. అలా ప్రతిజ్ఞ చెయ్యి-నేను స్వేచ్ఛగా చస్తాను..." అతను వాక్యం పూర్తి చెయ్యకముందే; నేను మధ్యలో అందుకున్నాను, "బాబా, నువ్వు సామాన్యమానవుడవు కావు-దేవతవు." "దేవతా?—" ఓసారి నవ్వాడు. "దేవతని కాదు కాని, మనిషినవాలని ప్రయత్నించాను. ఇహాను నేను... స్వేచ్ఛగా అల్లా దగ్గరకు..." అతని స్వరం ఆగిపోయింది...

("ధర్మయుగ్" ఆధారం)

---

క థా ని క

# మ ధ్యా మా వ తి

"శ్రీవిరించి"

తను చేస్తున్న పనికి తనకే ఆశ్చర్యంగావుంది సరస్వతికి. పద్ధెనిమిదేళ్ళ కాపురంలో యిట్లాంటి రోజు ఒక్కటైనా తనకు గుర్తులేదు.

ప్రతి మనిషికీ ఒకో్క్కస్థితిలో అహంభావం, గర్వం, అతిశయం ఎక్కువ. పాలపొంగులా ఈ స్వభావాలు ఉబికి సాధ్యమైనంత తొందర్లో చల్లారిపోతాయ్. కానిపక్షంలో మనిషి అవరోహణకు కారణం అవుతాయ్. సరస్వతికి ఇప్పుడిదే గర్వం; పద్ధెనిమిదేళ్ళనుంచీ కాపురం చేస్తున్నానని-యేమీ పొరుపు లేకండా. ఒక్కనాడు కీచులాడుకోలేదు తనూ ఆయనా. వారిచర్యల్ని వేటినీ తను నిందించలేదు. అన్యోన్యంగా కాపురము చేస్తున్నందుకు గర్వం. ఎదటివాళ్ళకు లేని సుఖాన్ని ఆనందాన్ని పొందుతున్నందుకు ఆత్మని జయించినంత గర్వం.

ఎందుకో అర్థంకాదు. కాపురం చేస్తోనే ఉంటారు, కాని ఒకళ్ళ మనస్సు లింకొకళ్ళకి తెలీవు. ఎవరికేం యిష్టమో కనిపెట్టలేరు. జీవితాల్లో అశాంతి పెంచుకుంటూరు. ఆఖరిక్షణాల్లో పశ్చాత్తాపపడిమట్టుకు ప్రయోజనం యేమిటి?

కాలం యెంత సరదాగా దొర్లిపోయేదనీ! తను కాపురానికొచ్చినకొత్తలో ఆయనకు ఉద్యోగము లేదు. ఎం. ఏ. ప్యాసై యింట్లోనే కూచున్నారు. ఎవరేనా "మీ ఆయన కేంపనీ" అనడిగితే తను అభిమానపడేది. ఆయనతో పరిచయం లేకపోయినాసరే, ఎందుకు కాళీగా వున్నారో తెలీకపోయినాసరే ఆయన తరుఫున స్నేహితురాళ్లతో వాడించేది. ఎన్నో కోతలు కోసేది—తన వాదాన్ని సమర్థించుకుందుకు.

సరళే కావును ఒకసారి యేదో విషయంలో వచ్చి అంది "సరస్వతి మొగుడు నిరుద్యోగ డిపార్ట్‌మెంట్‌కి ఛీఫ్ సెక్రటరీ" అని. అప్పుడు తనెంత అభిమానపడ్డదీ? ముఖం కందగడ్డలా ఎర్రగా అయినా అక్కడున్న నలుగురూ యేమనుకుని పోతారోనని పమిటితో కప్పుకుని ఎంత వేషం వేసింది? ఏ ముహూర్తాన అన్నదో కాని సరళ మాట నిజమే అయింది. పోతే డిపార్ట్‌మెంట్ పేరే మారింది కాని.

అప్పట్లో తనకు భర్తమీద కోపంకూడా వచ్చేది. ఇప్పుడాలోచించుకొంటే యెంత తెలివి తక్కువకనీ? ఉద్యోగంలేకపోతే మనిషివిలువ తగ్గిపోతుందా? విజ్ఞానానికి గీటురాయి ఉద్యోగం కాదుగదా! ఎంత సంబాళించుకుందామన్నా తన శక్తికి అతీతమే అయ్యేది "ఎమ్మేపాసయారు, ఊరికేనే ఉన్నారు." మొదటిముక్క ఎంత హుందాగా చెబుతుందో రెండోముక్క అంత రహస్యంగానూ! ఒకో్క్కపని చెయ్యటం తప్పు కాదని మనకు తెలిసినా యెవో అజ్ఞాతశక్తులకు భయపడుతూ ఆ పని చెయ్యలేకండా పోతాం. అంత అసమర్థులం మనం!

కాపురానికొచ్చిన కొత్తరోజులు తల్చుకుంటే అవి యేజన్మలోనూ మరుపురావనిపిస్తుంది. ఉద్యోగం లేదాయెను, యిరవై నాలుగ్గంటలూ తనతోనే ఉండేవారు. ఇట్లా యెన్నాళ్లున్నా యెవరికీ మొహంమొత్తేది కాదు. కాని యింతలోనే వుద్యోగం వచ్చింది. మొదట నేను వెళ్ళనన్నారు. తనేమీ మాట్లాడకుండా వుంటే అంతే అయేది.

"నిక్షేపంలాంటి వుద్యోగం ఇస్తానని వొస్తోంటే చేదయిందిటండీ చేరక?" అన్నది తను.

"ఉద్యోగం ఎందుకులెద్దూ" అంటారాయన.

"చదూకున్నందుకు—" యింకా తను వాక్యం పూర్తి చెయ్యనేలేదు; ఆయన అన్నారు. "చదువుకుంటే ఉద్యోగంచెయ్యాలని యెక్కడా లేదు. ఉద్యోగం కేవలం ఉదర నిమిత్తం."

కాని తనే పట్టుపట్టుంది. ఏదో దూరం ఆలోచించికాదు, కేవలం మూర్ఖంగా!

"ఈ వుద్యోగంలో చేరకపోతే నామీద ఒట్టేసుమండీ" అన్నది తను. ఎందుకన్నది ఆ మాట? ఎంత తెలివితక్కువగా వ్యవహరించింది తను?

"ఎంత ఒట్టుపెట్టుకున్నావ్ సరస్వతీ?— నాకు ఒట్లంటే నమ్మకంలేదనుకో. అయినా నీకు నమ్మకం వున్నదికనక, నువ్వే ఒట్టుపెట్టుకున్నావ్ కనక ఉద్యోగంలోవుండి నీకు క్రమంగా యెట్లా దూరమైపోతానో చూడు - నువ్వే కొన్నాళ్ళకి విసుగుపుట్టి నాచేత రిజైనిప్పిస్తావు- నాకు తెలీదూ నీసంగతి?" అన్నారు.

అన్నారు. కాని తనకదే మూఢవిశ్వాసం. మొదట్లో కాస్తలోటుగా నేవుండేది. కాని కాలం గడపటానికి యెన్ని ఉపాయాల్లేవూ? రోజుకో కొత్తపుస్తకం కొనుక్కొస్తుండేవారు. తనే దాన్ని చదివి కథచెబుతోండేది. ఒక్కో కథ విని వారు పరవశం అయిపోయేవారు. తనకి కథల్లో పాత్రలతో సానుభూతి వుండేదికాదు!- కేవలం వాళ్ళు పాత్రలు కనక. అందుకనే ఆయన అంటూంటారు: "జీవితం అంటే ఏమిటో నువ్వేమీ ఆలోచించవు" అని.

అవును. ఎందుకాలోచించాలీ తను? ఆలోచనల్తో బుర్ర పాడుచేసుకోవాల్సిన అవసరం తనకేమిటి?

—కాని యిదేమిటి యీ రోజున తనకిన్ని ఆలోచనలొస్తున్నాయి? ఎన్నడూ లేదే!

చీకటిపడి చాలాసేపయింది. చంద్రుడుకూడా నిండా కనిపిస్తున్నాడు. టైం తొమ్మిది దాటుతోంది. ఆయన యింకా యింటికి రాలేదు. ఎన్నడూ లేదు యిట్లా. సాయంత్రం ఆరవటంతోటే రేపటిపేపరు చేతపుచ్చుకుని మెట్లెక్కుతూ వంటింట్లోవున్న తనకి కనిపించేవారు. ఇవాళ యెంచేత రాలేదూ? స్నేహితుల్తో కలిసి సినిమాకివెళ్ళే అలవాటు ఆయనకి చిన్నప్పటినించే లేదు. సినిమాలంటే కొంత అసహ్యమే కూడాను! ఎప్పుడేనా తను పోదామని ఉబలాటపడితే రెండో ఆటకి యిద్దరూ కదలేవారు. ఎంచేత రాలేదు? పద్దెనిమిదేళ్ళ తన కాపురంలో ఎరగని రోజు యివాళ దాపురించిందే తనకి?

మనిషికూడా యేమీ ప్రత్యేకంగా లేరు. మామూలుగానే పదింటికి ఆఫీసుకి వెడుతూ తన్ను పిలిచి తలుపేసుకోమన్నారు. తలుపు వేస్తూండగా దగ్గరికి తీసుకున్నారు కూడాను!

ఆఫీసు పనేమీ ఘనమైంది కాదు. చేతికింద బోలెడంతమంది గుమాస్తాలు. కేవలం సంతకాలు పెట్టటమే ఆయనపని. రాత్రిపూట ఆఫీసేమిటీ?

ఆయనగారికి చెప్పుకోతగ్గ మిత్రులుకూడా యెవరూలేరు. ఎవరితోటీ ఆయన నోరువిప్పి క్షణంసేపయినా మాట్లాడి యెరగరు. ఈ రాత్రి తొమ్మిదిగంటలు దాటి పది అవుతూన్నా ఇంకా రాలేదేం? ఇప్పటికే మూడున్నరగంటల లేటు! దగ్గరదగ్గర రెండొందల నిమిషాలు!

తనకేమీ తోచటంలేదు. కారణం యేమిటో ఊహ కందటంలేదు. ఏమైనారు? ఎవరికి ఫోన్ చేసి కనుక్కోవాలి తను? ఏదారీ తోచదు.

తను యెవరినీ యెరగదు. ఈ ఇల్లేమో, ఆయనేమో చదువుతున్న పుస్తకాలేమో కాని యితరం తనకి తెలీదు. ఇంటికి ఆలస్యంగా రావటం ఆయనకెన్నడూ అలవాటులేదు కనుకనే తనకి కలవరపాటంతా!

సరస్వతి మళ్ళీ సముదాయించుకోబోయింది, ఏమిటి నేనింత బేలనైపోతున్నాను? ఆయనేం చిన్నవారా? చిలకవారా? ఏదో పనిమీద వెళ్లుంటారు, ఇంతమాత్రానికే నాకు దిగులెందుకు?"

కాని ఆయనకేం పని? ఇంత రాత్రిపూట ఎక్కడ ఒయ్యెద్దేరారో అక్కడికే రావాలికదా! ఎంచేత ఆలస్యం అయింది?

ఒకటి కాదు, రెండు కాదు; లక్ష కారణాలు దొరుకుతాయి ఆలస్యానికి. కాని ఒక్కటీ రెండో పక్షుపువాదానికి నిలవదు. ఆయనకు యింటికి రావటం ఆలస్యంకావటం ఈ యిద్దరి జీవితాల్లో యిదే ప్రథమం!

పద్ధెనిమిదేళ్ళనించీ కాపురం చేస్తున్నారు, ఒక్క విషయంలోనైనా పొరపులేకండా, ఆ కారణం చూచుకునే తను యింత గర్వపడుతున్నదని! కాని యీ రాత్రి యెందుకాలస్యం అయినారు? ఏమో తనకి అర్థం కాదు.

ఆయన వొచ్చి పరిస్థితి అంతా చెబితేగాని-తనకేమీ తెలీదు అంతదాకా ఊహించుకు తృప్తి పడేందుకు కేనా తూనిక చాలదు. ఏంచెయ్యాలి తను యీ అసహాయస్థితిలో?

భయపడ్డ లేడిలా పరువెత్తుతోంది కాలం. పన్నెండు గంటలు. అయినా ఆయన రాలేదు. ఈ ఆరుగంటల్లోనూ తనకెన్ని ఆలోచన్లు వచ్చినాయో తల్చుకుంటే తన మేధస్సుకి తనకే ఆశ్చర్యం వేస్తుంది సరస్వతికి.

ఎక్కడా చీమ చిటుక్కుమన్న శబ్దం కూడా లేదు. గదిలో తనూ, ఎదురుగా వెలుగుతోన్న మెర్క్యురీ దీపం, గాలికి అల్లలాడుతున్న పేజీల పుస్తకం. కాసేపు యీ సంగతే మర్చిపోయి పుస్తకం చదూకుందామనుకుంటుంది. కాని యీ రోజు తను యెవరికి చెప్పాలి కథ? ఎవరికోసం యిన్నాళ్ళూ?

ఒక్కక్షణం తనమీదేతనకు కోపం వచ్చింది, ఎందుకు చేరమన్నాను యీ వుద్యోగంలో అని! కాని వుద్యోగం చేస్తోన్న యిన్నేళ్ళలోనూ ఇదే మొదటిసారి యింటికి ఆలశ్యంగారావటం. ఆలస్యమయినా ఒకటి రెండు గంటలు కాదు. ఏకంగా రెండు జాములు!

గడియారం ఒకటి కొడుతూండగా యెవరో తలుపుతట్టిన చప్పుడు. తన చెవుల్ని నమ్మేందుకు తనకే ధైర్యం చాలదు. మళ్ళీ చప్పుడు. అవును. వారే-"సరస్వతీ!" అని పిలుస్తున్నారు కూడా!

తలుపుతీసింది తను. లోపలికి వచ్చారు. ఓర కంటితో చూచారు. తను మాత్రం గంభీరంగా నించుంది. అడగలేను ఎందుకాలశ్యం అయిందని! అలవాటు లేదుగా మరి?

డ్రెస్సు మార్చుకుని పడుకున్నారు.

తనతో మాట్లాడరేం? ఏంచేత? తనుమాత్రం అట్లా మూగగా నించుంటుందేం?

"భోజనం చేశావా?" అన్నారు వారే.

"లేదు."

"అయితే వేంటనే చెయ్యి. నేను ఓ మిత్రుడింటికి వెళ్ళొస్తున్నాను."

"ఈవేళప్పుడేంభోజనం-నాకాకలిలేదు తినను" అన్నది తను.

"తినవా? నిజంగా తినవా? ఏమీ అనుకోకు, ఆలస్యం ఐతే బెంగెందుకూ? లే—" అన్నారు.

తనేమీ మాటాడ్లేదు. అట్లానే నించుంది.

"నీ సంశయం నాకు తెలుసులే. ఎందుకాలస్యం అయిందీ అంటావు. చెప్తానుగా ఎంత నచ్చ చెప్పచూచినా వినకు, ఇంటికివచ్చి భోజనం చేస్తేగాని బతకలేనంటాడు, మాట బొత్తిగా తీసెయ్యటానికి మొహమాట మాయెను! కొంతమందికి తమపట్టు నెగ్గటమే గాని యితరులని బాధించటం యెంచుకని ఉండదు. ఇతరుల బాధలు వాళ్ళ కక్కర్లేదు-నువ్వు యిట్లానే కూర్చుంటావని నాకు తెలుసు. ఇక యీ రాత్రికి భోంచెయ్యవు. చెయ్యమని నేను బలవంతం చెయ్యలేను. ఇంతకూ అతను నా స్నేహితుడూ ఆఫీసులో సమాన హోదా మనిషి!—"

సరస్వతికి యేమనేందుకూ తోచదు.

పద్ధెనిమిదేళ్ళనించీ కాపురం చేస్తోంది తను-ఆయన స్నేహితుడి మాట తీసెయ్యలేక రాత్రి ఒంటిగంటవరకూ యింటికి రాలేకపోయారు.

జాముకోడి కూసింది.

ఆయన "అబ్బ. నిద్రరావటంలేదు, ఏదేనా కథ చెబుదూ" అన్నారు. సరస్వతి నోరు విప్పింది.

---

ఎల్లయ్య: "నాకు చాలా కంగారుగా ఉంది. తన భార్యతో సరససల్లాపాలు కట్టిపెట్టకపోతే చూసుకో అని బెదిరిస్తూ ఒకడు నాకు ఉత్తరం రాశాడు."

పుల్లయ్య: "కంగారు దేనికి? అక్కడికి వెళ్ళడం మానెయ్!"

ఎల్లయ్య: "నిజమే! కాని ఆ ఉత్తరంలో రాసినవాడి పేరు లేదు మరి!"